


# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

PRGI Reg.No: APTEL/26/A0309

KADAPA MANASSAKSHI - Telugu Daily






వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 సంచిక : 160 | మంగళవారం, 23 జూన్ 2026 | పేజీలు : 4 | వెల.రూ.2/-


## 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ: ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టి ధ్యేయం -- మంత్రి లోకేష్



న్యూఢిల్లీ (జూన్ 22): రాబోయే 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల భారీ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని సాధించేందుకు గాను ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026' లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్.. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో వస్తున్న మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' (తరాల మార్పు) కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే ఉన్నారని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## ఆర్డీఎస్‌లో తెలంగాణ నీటి వాటాపై రాజీ లేదు: మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్ : హైదరాబాద్ :తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




అమరావతి: రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని, ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారని దుయ్యబట్టారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని గుర్తు చేశారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చంద్రబాబు తెలిపారు. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరమని గుర్తుచేశారు. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలను నేరుగా ప్రజల ముందు ఉంచనుంది. ఇందుకోసం ఆయా రంగాల వారీగా 10 అంశాలపై నివేదికలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే నిర్ణయించారు. 10 అంశాల్లో అభివృద్ధి, ఆర్థిక రంగం, సుపరిపాలన, సంక్షేమం-సాధికారత అంశాలకు సంబంధించిన నివేదికలను ముఖ్యమంత్రి విడుదల చేస్తారు.

## ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు: మాజీ మంత్రి అంబటి రాంబాబు



అమరావతి (జూన్ 22): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయవాడకు చెందిన సాయికృష్ణ అదృశ్యం కేసు అంశంపై పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సచివాలయం మీడియా పాయింట్ లేదా విలేకరుల సమావేశంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఒకవైపు ప్రభుత్వం బాధితులకు న్యాయం చేస్తామని చెప్తూనే, మరోవైపు సాయికృష్ణను ఒక క్రిమినల్ అన్నట్టుగా పవన్ కళ్యాణ్ మాట్లాడటంపై మండిపడ్డారు. జనసేన నేత స్వామినేని ఉదయభాను మాత్రం బాధితుడి ఇంటికి వెళ్లి "పవన్ పంపిస్తేనే వచ్చాం" అంటున్నారని.. అసలు పవన్ కళ్యాణ్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే క్లారిటీ లేదని ఎద్దేవా చేశారు. ఈ కేసులో నిజాలు బయటకు రావాలంటే 'సిట్' నాటకాలు ఆపి, సీబీఐ (జదీ×) లేదా ఎన్ఐఏ (చీ×ూ) చేత విచారణ జరిపించాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. వైస్సార్సీపీ నేతల తోలుతీస్తామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. "రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ సీఎం పదవిలో ఉండి మాట్లాడే భాషేనా ఇది? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా పవన్ గారూ? మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. "నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం" అని పవన్ కళ్యాణ్ అనడం ద్వారా... ప్రస్తుతం ఉన్న హోంమంత్రి అనిత సరిగ్గా పనిచేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి రాంబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అందుకే పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబు నాయుడిని రిక్వెస్ట్ చేస్తున్నానని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని అంబటి గుర్తుచేశారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూనే, మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దంటూ వెనుక ఉండి ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు.

## జీవో 111 పరిధిపై రేవంత్ సర్కార్ కొత్త ప్లాన్ !

హైదరాబాద్ : హైదరాబాద్ :హైదరాబాద్ మహానగర శివార్లలోని పర్యావరణ పరిరక్షణ జోన్ అయిన జీవో 111 పరిధిలోని 84 గ్రామాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ఈ ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం లేదా భారీగా సడలింపులు ఇచ్చే అంశంపై ఏర్పాటైన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ నివేదికలను ప్రభుత్వం సుదీర్ఘంగా పరిశీలిస్తోంది. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య నిర్మాణాలకు వీలుగా కొత్త జోనింగ్ నిబంధనలను తీసుకురావాలనే ప్రతిపాదనలపై సచివాలయ వర్గాల్లో ముమ్మర చర్చలు సాగుతున్నాయి. పర్యావరణ అనుమతులు, ప్రత్యామ్నాయ డ్రైనేజీలపై ఫోకస్! చారిత్రాత్మక జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వరద మార్గాలకు, పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా బ్యాలెన్స్ పాటించడంపై ఈ వారంలో ఉన్నతాధికారులు కీలక సమీక్షలు నిర్వహించారు. జలాశయాల్లోకి మురుగునీరు చేరకుండా ప్రత్యామ్నాయ డ్రైనేజీ నెట్‌వర్క్ , అత్యాధునిక మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ 1.32 లక్షల ఎకరాల పరిధిలో కేవలం 10 శాతం విస్తీర్ణంలోనే గ్రీన్ బిల్డింగ్స్, లగ్జరీ విల్లా ప్రాజెక్టులకు అనుమతులిచ్చి, మిగిలిన 90 శాతం ల్యాండ్‌ను గ్రీన్ జోన్ లేదా కన్జర్వేషన్ జోన్‌గా ఉంచే వ్యూహంపై అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ మార్కెట్ కు మళ్లీ రెక్కలు! ప్రభుత్వ సానుకూల పరిణామాలతో పశ్చిమ హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన చేవెళ్ల, శంకర్ పల్లి, మొయినాబాద్ బెల్ట్‌లో ల్యాండ్ లావాదేవీలు అకస్మాత్తుగా ఊపందుకున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా



ఇక్కడి రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగించినట్లు కనిపించినా, జీవో సడలింపుల వార్తలతో ఇన్వెస్టర్లు, పెద్ద పెద్ద డెవలపర్లు మళ్లీ వెంచర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండే వట్టినాగులపల్లి, ఖానాపూర్, జన్వాడ, అజీజ్‌నగర్ వంటి గ్రామాల్లో ఓపెన్ ప్లాట్లు, ఫామ్‌ల్యాండ్స్ కొనుగోలుకు దేశీయ, ఎన్నారై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



# స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి: పులివెందుల మున్సిపాలిటీ

పులివెందుల (మనస్సాక్షి) జూన్ 22 : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పులివెందులకు మంచి ర్యాంక్ తెచ్చేందుకు ప్రజలు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని మున్సిపాలిటీ కోరింది. పట్టణాన్ని పరిశుభ్రంగా,ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. ప్రజల సహకారం,మద్దతు విలువైనదని పేర్కొంది. ఒక్క ఫీడ్‌బ్యాక్ పట్టణ గౌరవాన్ని పెంచుతుందని వివరించింది. దేశ స్థాయిలో గుర్తింపు వస్తుందని తెలిపింది. పులివెందుల అభివృద్ధికి ఫీడ్‌బ్యాక్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ప్రజల ప్రేమ,ఆదరణే తమ బలమన్నారు. విలువైన సమయం కేటాయించి స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్వహణను O&M ఉద్యోగులకే అప్పగించాలి: విద్యుత్ ఉద్యోగుల సంఘం



కడప, జూన్ 22 (మనస్సాక్షి): 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను డివిజనల్ O&M ఉద్యోగుల నుంచి తొలగించి ఇతర సిబ్బందికి అప్పగించే ప్రయత్నాలను నిలిపివేయాలని O&M ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఆపరేషన్ ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు. సబ్‌స్టేషన్ల నిర్వహణలో రాడవీ ఉద్యోగులకు విశేష అనుభవం, సాంకేతిక నైపుణ్యం ఉన్నందున వారినే కొనసాగించాలని కోరారు. ఇటీవల జారీ చేసిన ఆదేశాల కారణంగా విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, భద్రతాపరమైన సమస్యలు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగాలంటే సబ్‌స్టేషన్ నిర్వహణ బాధ్యతలు రాడవీ సిబ్బందికే ఉండాలని పేర్కొంది. అలాగే గారపెంట మండల పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణను డివిజనల్ రాడవీ ఉద్యోగుల ద్వారానే కొనసాగించాలని కోరుతూ మరో వినతిపత్రాన్ని సమర్పించారు. విద్యుత్ ఉద్యోగుల ప్రయోజనాలు, వినియోగదారుల సేవల దృష్ట్యా యాజమాన్యం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది.

# ప్రజా సమస్యలు పట్టించుకోని ఎంపీడీవో?

తొండూరు (మనస్సాక్షి) జూన్ 22 : తొండూరు మండలంలోని పలు గ్రామాల్లో వీధిలైట్లు వెలగడం లేదు. మురుగు కాలువలు నిండి రోడ్లపై పారుతున్న, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యలు తీవ్రమవడంతో మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని చెబుతున్నారు. సమావేశాలకు సమాచారం ఇవ్వకుండా ఎంపీడీవో ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. సమాచారం లేక సభ్యులు రాక సమావేశాలు వాయిదా పడుతున్నాయి. దీంతో ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఎంపీడీవో విష్ణు ప్రసాద్‌పై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మొహర్రం శాంతియుతంగా జరపాలి: సీఐ కులాయప్ప



మైలవరం (మనస్సాక్షి) జూన్ 22 : మొహర్రం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని జమ్మలమడుగు రూరల్ సీఐ కులాయప్ప సూచించారు. సోమవారం మైలవరం ఎస్సై శ్యాంసుందర్ రెడ్డితో కలిసి నార్జంపల్లె గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఏర్పాట్లు,శాంతిభద్రతలపై చర్చించారు. సామరస్య వాతావరణంలో పండుగ జరపాలని సీఐ కోరారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలన్నారు. చట్టాలను గౌరవించాలని యువతకు సూచించారు. ఊరేగింపులకు ముందస్తుగా పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. సమస్యలుంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామ పెద్దలు,యువకులు,సిబ్బంది పాల్గొన్నారు.


# పీజీఆర్ఎస్ ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి: ఎస్పీ నచికేత్

కడప (మనస్సాక్షి) జూన్ 22 : పీజీఆర్ఎస్ ఫిర్యాదులను చట్ట పరిధిలో గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 144 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వృద్ధులు,దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు శాఖ పరిధిలోని ప్రతి ఫిర్యాదును స్వేచ్ఛగా తమ దృష్టికి తేవాలని కోరారు. నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె. ప్రకాష్ బాబు,స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్ పాల్గొన్నారు.

# తొండూరు టీడీపీలో అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయా?

**-ఒక వర్గానికే పనుల కేటాయింపంటూ నేతల ఆగ్రహం**

**-పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకోవాలని డిమాండ్**




తొండూరు (మనస్సాక్షి) జూన్ 22 : తొండూరు మండల తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండల స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,పనుల కేటాయింపుల్లో ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ పలువురు టీడీపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న నాయకులు,కార్యకర్తలకు తగిన గుర్తింపు,అవకాశాలు దక్కడం లేదని కొంతమంది నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ నాయకుడు తనకు సన్నిహితంగా ఉన్నవారికే పనులు అప్పగిస్తూ,ఇతర వర్గానికి చెందిన నాయకులను పక్కన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు,అభివృద్ధి పనుల విషయంలో పార్టీకి చెందిన ప్రతి కార్యకర్తకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు నాయకులు పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న వారిలో అసంతృప్తి పెరుగుతోందని అంటున్నారు.పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించకుండా ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి అని కొందరు సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానికంగా పార్టీ బలపడాలంటే అందరినీ కలుపుకొని వెళ్లే విధానం అవసరమని సూచిస్తున్నారు. అభివృద్ధి పనుల కేటాయింపుల్లో పారదర్శకత ఉండాలని,పార్టీకి చెందిన ప్రతి నాయకుడు,కార్యకర్తకు గౌరవం దక్కేలా చూడాలని వారు కోరుతున్నారు. తొండూరు మండలంలో నెలకొన్న ఈ పరిస్థితిపై జిల్లా స్థాయి టీడీపీ నాయకత్వం దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పలువురు నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో ఏర్పడుతున్న విభేదాలు మరింత ముదరకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు ఈ పరిణామాలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. రానున్న రోజుల్లో జిల్లా నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ప్రతి రైతు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి



ముద్దనూరు (మనస్సాక్షి) జూన్ 22 : ప్రతి రైతు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. కె.తిమ్మాపురం,కొత్తపల్లె,పెనగికలపాడు గ్రామాల్లో 'రైతన్న మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూరియా,డీఏపీ ఎరువులు పారదర్శకంగా అందించేందుకు ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ అందుబాటులో ఉందని తెలిపారు. ఎరువులు పొందేందుకు ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు,అగ్రిటెక్ వినియోగం,ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వ సహకారంపై వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు నమోదు చేసుకుని పథకాల ప్రయోజనాలు పొందాలన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది,సచివాలయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.


# కొరియా కంపెనీలకు ఏపీ భాగస్వామ్యం: లోకేశ్



న్యూఢిల్లీ (మనస్సాక్షి) జూన్ 22 : దక్షిణ కొరియా రాయబారి లీ సియోంగ్-హోతో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలో రాయబారితో సమావేశమయ్యారు. భారత్‌లో కొరియా కంపెనీల పెరుగుతున్న ఉనికిపై చర్చించారు. సెమీకండక్టర్లు,మైక్రో ఎలక్ట్రానిక్స్,స్టోరేజ్,షిప్‌బిల్డింగ్,ఎలక్ట్రిక్ వాహనాల్లో కొరియా ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని లోకేశ్ తెలిపారు. ఈ రంగాల్లో ఏపీ దీర్ఘకాలిక భాగస్వామిగా ఉండగలదని వివరించారు. కొరియా కంపెనీలకు ఏపీలో అవకాశాలను వివరించారు. భారత్‌లో మరింత సహకారానికి ఉన్న అవకాశాలపై ఇరువురు చర్చించారు. 'ఫాజ్ స్పీడ్ ఫాజ్ ఏపీ' అంటూ రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించారు. రాయబారికి లోకేశ్ జ్ఞాపికను బహూకరించారు.

# ఏపీఎల్ క్రికెట్ టోర్నీ విజయవంతం..

# కడప స్టేడియం జిల్లాకు గర్వకారణం: పోలంకి గణేష్ బాబు




కడప, జూన్ 22 (మనస్సాక్షి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), వైఎస్సార్ కడప క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 17 నుంచి 22 వరకు నిర్వహించిన ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘన విజయాన్ని సాధించిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామనపల్లికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేష్ బాబు పేర్కొన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో అత్యాధునిక సదుపాయాలతో నిర్వహించిన ఈ మ్యాచ్‌లను ప్రతిరోజూ సుమారు 8 వేల నుంచి 10 వేల మంది ప్రేక్షకులు వీక్షించడం విశేషమన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైన వైఎస్సార్ కడప క్రికెట్ స్టేడియంలో ఉన్న సౌకర్యాలు జిల్లాకే గర్వకారణమని తెలిపారు. ఈ స్టేడియం అభివృద్ధికి భరత్ రెడ్డి, సంజయ్ కుమార్ రెడ్డి, మునికుమార్ రెడ్డి, రెడ్డి ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఈ స్టేడియం ద్వారా భవిష్యత్తులో ఎందరో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలోని క్రీడాకారులు స్టేడియం సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా యాజమాన్యం అవసరమైన అనుమతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా 1993-94లో అప్పటి కలెక్టర్ రమణాచారి ఆధ్వర్యంలో కడప మున్సిపల్ మైదానంలో నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ మ్యాచ్‌లో భారత క్రికెట్ దిగ్గజాలు కపిల్ దేవ్, రవిశాస్త్రి, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రావిడ్, మనోజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొనడం కడప క్రీడా చరిత్రలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు కూడా కడపలో నిర్వహించబడతాయని, తద్వారా జిల్లా ప్రజలు మరిన్ని అద్భుతమైన మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం పొందుతారని పోలంకి గణేష్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

కడప మనస్సాక్షి
PRGI Reg.No: APTEL/26/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily
మంగళవారం, 23 జూన్ 2026

# సంతకొవ్వూరులో పోలియో సిబ్బందికి శిక్షణ




తొండూరు (మనస్సాక్షి) జూన్ 22 : మండల పరిధిలోని సంతకొవ్వూరు పీహెచ్‌సీలో సోమవారం పల్స్ పోలియో బూత్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ ముంతాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈనెల 28 నుంచి 30 వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. 0–5 ఏళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ ముంతాజ్ సూచించారు. 28న బూత్‌ల వద్ద చుక్కలు వేస్తారు. 29,30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు వేస్తారన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి డి. సుబ్రహ్మణ్యం,పీహెచ్ఎన్ ఎం. రాధా రుక్మిణి శిక్షణ ఇచ్చారు. చుక్కలు వేసే విధానం,గృహ సందర్శనలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు,వాలంటీర్లు పాల్గొన్నారు.

# నేటి నుంచి పులివెందులలో జగన్ పర్యటన

కడప (మనస్సాక్షి) జూన్ 22 : మాజీ సీఎం వైఎస్ జగన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం సాయంత్రం పులివెందుల చేరుకోనున్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. 24న వేముల మండలం భూమయ్యగారిపల్లిలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఆలయానికి కోటిన్నరకు పైగా మంజూరు చేశారు. ఎంపీ అవినాష్ రెడ్డి పాడా నిధులు,దాతల విరాళాలతో రూ.2.5 కోట్లతో ఆలయాన్ని పునఃప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకుని మధ్యాహ్నం నుంచి ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. 25న ఉదయం తిరుగు ప్రయాణమవుతారు.

# లక్ష్మీదేవమ్మ దశదిన కర్మకు బీటెక్ రవి



సింహాద్రిపురం (మనస్సాక్షి) జూన్ 22 : మండల పరిధిలోని హిమకుంట్ల గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తల్లి లక్ష్మీదేవమ్మ దశదిన కర్మకు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి హాజరయ్యారు. లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు,కార్యకర్తలు,స్థానికులు పాల్గొన్నారు.

# 29న 'చలో కడప'కు తరలిరావాలి: ఎంఎస్పీ



పులివెందుల (మనస్సాక్షి) జూన్ 22 : బ్రహ్మంగారిమఠం మండలంలో ఇద్దరు మాదిగ యువకుల హత్య కేసును తేల్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న 'చలో కడప' నిర్వహిస్తున్నట్లు ఎంఎస్పీ జాతీయ నేత గుండాల ఈశ్వరయ్య మాదిగ తెలిపారు. సోమవారం పులివెందుల ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం జరిగింది. సమావేశానికి కొమ్ము నాగేశ్వరరావు మాదిగ అధ్యక్షత వహించారు. ఫిబ్రవరి 5న గుండాపురానికి చెందిన ఓబులేసు (20),మునుమాలకు చెందిన సతీష్ (19) హత్యకు గురయ్యారని నేతలు ఆరోపించారు. పథకం ప్రకారం హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించారన్నారు. నాలుగు నెలలైనా దర్యాప్తులో పురోగతి లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో న్యాయం జరగలేదన్నారు. ఐపీఎస్ స్థాయి అధికారితో విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు,మండల నేతలు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు!! కలెక్టర్, ఎస్పీ భవనాలను తిరిగి విద్యార్థులకే ఇవ్వండి!!

**-పేద మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును కాపాడండి**

**-అన్నమయ్య జిల్లా కలెక్టర్ కు విన్నవించిన ఏఐఎస్ఎఫ్**



రాయచోటి (మనస్సాక్షి): అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ని ప్రకటించినప్పుడు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల భవనాల కోసం పాలిటెక్నిక్ హాస్టల్, ఎస్టీ హాస్టల్ పాఠశాల భవనాలను తాత్కాలికంగా రాయచోటిలో కలెక్టర్ మరియు ఎస్పీ కార్యాలయాల కోసం కేటాయించారని జిల్లా కేంద్రం తరలిపోవడంతో వీటిని తిరిగి విద్యార్థుల వసతి గృహానికి, పాఠశాలకు వినియోగించాలనిఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కమిటీ సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ ను కలిసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి పట్టణం నందు గల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల భవిష్యత్తును, స్థానికంగా ఉన్న గిరిజన విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆ కళాశాల హాస్టల్ భవనాలను, గిరిజన పాఠశాల హాస్టల్ భవనాలను రాయచోటి లోని మాసాపేట గ్రామంలో నిర్మించిందని, రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పుడు ఎస్పీ కార్యాలయం కోసం పాలిటెక్నిక్ హాస్టల్ భవనాలను , కలెక్టర్ కార్యాలయం కోసం ఎస్టి హాస్టల్ పాఠశాల భవనాలను 2021లో ప్రభుత్వం ఆయా భవనాల నుండి విద్యార్థులను ఖాళీ చేయించి రాయచోటి కలెక్టర్, ఎస్పీ కార్యాలయం కోసం కేటాయించారని, హాస్టల్ భవనం నిర్మించిన తర్వాత పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ జిల్లాల నుండి వందలాదిమంది విద్యార్థులు ఆ కళాశాలలో చదువుకుంటూ వసతిగృహంలో ఉండేవారని భోజనం మరియు ఇతర మౌలిక సౌకర్యాలు ఆ విద్యార్థులకు అందేవని వారు అన్నారు. అయితే హాస్టల్ భవనమును ఎస్పీ గారి కార్యాలయానికి ఇచ్చిన తర్వాత కళాశాల విద్యార్థులు పట్టణంలో ఉన్నటువంటి బిసి ఎస్సి హాస్టల్స్ లో ఉంటూ 6 కిలోమీటర్ల మేర బస్సులలో ఆటోలలో ప్రయాణం చేసి ఉదయం టిఫిన్ చేసి మధ్యాహ్నం తిరిగి హాస్టల్ కు వెళ్లి తిని రావడానికి వీలు లేక ఉదయం చేసిన భోజనాన్నే తీసుకొని వచ్చి మధ్యాహ్నం తిని తిరిగి మళ్ళీ హాస్టల్స్ కి వెళ్లే పరిస్థితి వారికి నెలకొని ఉందని వారు మండిపడ్డారు. అంతేకాకుండా ప్రభుత్వ హాస్టల్స్ లో సీట్లు దొరకక ప్రైవేట్ హాస్టల్స్ లో నాలుగు వేల నుండి 5వేల రూపాయల వరకు డబ్బులు కట్టి వారు ఉండాల్సినటువంటి పరిస్థితి నెలకొని ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2025 లో అన్నమయ్య జిల్లా కేంద్రం తరలిపోవడంతో జిల్లా కార్యాలయాలు అన్నీ కూడా మదనపల్లి ప్రాంతానికి తరలిపోయాయి అని అన్నారు. ఎస్పీ కార్యాలయ నిర్వహణకు తాత్కాలికంగా ఇచ్చినటువంటి పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థుల వసతృహ భవనమును తిరిగి ఆ కళాశాల విద్యార్థులకు అప్పజెప్పాలని, ఎస్టీ హాస్టల్ విద్యార్థులను పాఠశాల భవనాలను ఖాళీ చేయించి రాయచోటిలో కలెక్టర్ కార్యాలయానికి ఇచ్చిన భవనాలను తిరిగి వారికి అప్పజెప్పి తద్వారానే వివిధ జిల్లాల నుండి వచ్చి ఇక్కడ విద్యను అభ్యసించే పేద ,మధ్యతరగతి విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించిన వారు అవుతారని లేనిపక్షంలో విద్యార్థులకు అప్పజెప్పేవరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మున్నా జిల్లా గర్ల్స్ కన్వీనర్ గంగారాణి తదితరులు పాల్గొన్నారు.

# టెట్ ను సంబంధిత సబ్జెక్టులో మాత్రమే నిర్వహించండి ..బీటీఏ



రాయచోటి జూన్ 22 (మనస్సాక్షి): టెట్ ( ఉపాధ్యాయ అర్హత పరీక్ష )ను రద్దు చేయాలి లేదా సంబంధిత సబ్జెక్టులో మాత్రమే టెట్ నిర్వహించాలని బహుజన్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర డిమాండ్ చేశారు. ఈరోజు వారు రాయచోటి లోని అంబేద్కర్ సర్కిల్లో విలేకరులతో మాట్లాడుతూ టెట్ లో కనీస అర్హత మార్కులు ఓసీలకు 90, బీసీలకు 75, ఎస్సీ ఎస్టీలకు 60 మార్కులు గా ఉన్నాయని ఈ కనీస మార్కులు సంబంధిత సబ్జెక్టులో ఉండేటట్లుగా ప్రశ్నా పత్రాన్ని తయారు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 23 (1 )లో పొందుపరిచిన అన్ని అర్హతలు 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ప్రతి ఉపాధ్యాయుడికి ఉన్నాయని ఉపాధ్యాయ అర్హత పరీక్షకు మించిన ప్రమాణాలతో రూపొందించిన డీఎస్సీని వారు ఎదుర్కొని ఉద్యోగంలో చేరారన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని 2010కి ముందు నియామకమైన ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ టెట్ ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్ రజాక్ మరియు రాష్ట్ర కార్యదర్శి రాయచోటి రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 30% మధ్యంతర భృతి ని ప్రకటించాలని గత ప్రభుత్వం కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా 27% మధ్యంతర భృతిని ప్రకటించిందని అలాంటి క్లిష్ట పరిస్థితులు ప్రస్తుతం లేనప్పటికీ ఈ ప్రభుత్వం ఐఆర్ ని ప్రకటించకుండా మీనమేషాలు లెక్కిస్తోందని ఈ సాచివేత ధోరణి మూలంగా ఉద్యోగ ఉపాధ్యాయులు భవిష్యత్తులో భారీ గా ఆర్థిక నష్టాన్ని చెవి చూడాల్సి వస్తుందని వారు వాపోయారు. వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించి పిఆర్సి కమిషన్ ని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఏవి రమణ ప్రధాన కార్యదర్శి గోపాల్ దాస్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ ఉద్యోగుల,కార్మికుల న్యాయమైన కోరికలు పరిష్కరించకపోతే ఆందోళన

**-విద్యుత్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వెన్నపూస సుబ్బిరెడ్డి**




ఎర్రగుంట్ల (మనస్సాక్షి) జూన్ 22 : పగలు,రాత్రి ఎండా వాన అని చూడకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికు,ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కరించుకుంటే ఆందోళన ఉధృతము చేస్తామని స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి అన్నారు. స్ట్రగుల్ కమిటీ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణలో భాగముగా ఆర్టీపీపీ ప్రధాన ద్వారం వద్ద సమస్యలను పరిష్కరించడములో యాజమాన్య నిర్లక్ష్యముకు వ్యతిరేఖంగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు,కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భముగా నిరసనకారులను ఉద్దేశించి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ తుపాన్లను కూడా లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేస్తున్న విద్యుత్ సిబ్బంది జీవితాల్లో మాత్రము వెలుగులేవని ఆవేదన వ్యక్తము చేశారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ కొరకు కార్మిక సంఘాలతో చర్చించడానికి విద్యుత్ యాజమాన్యాలు వెంటనే వేతన సవరణ సంప్రదింపుల కమిటీని నియమించాలని డిమాండ్ చేసారు విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ ఒప్పంద గడువు గత మార్చి తో ముగిసిన నూతన వేతన కొరకు ఇప్పటివరకు కనీసం సంప్రదింపుల కమిటీ ని విద్యుత్ యాజమాన్యాలు నియమించకుండా ఉండడం శోచనీయమని అన్నారు . కాంట్రాక్ట్ కార్మికులను తెలంగాణా తరహాలో సంస్థలో విలీనం చేసి 43 వేలు కనీస వేతనంఇవ్వాలని, వారిని రెగ్యులర్ చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో మార్పు లేదన్నారు .కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నరని వారిని సంస్థలో విలీనము చేశుకుని యాజమాన్యమే నేరుగా వేతనాలు ఇవ్వాలని అనేక సంవత్సరాలు పోరాటం చేస్తున్నామని అయినా ప్రభుత్వము,యాజమాన్యం స్పందించడం లేదన్నారు. థర్డ్ పార్టీ విధానము తొలగించి డైరెక్ట్ గా వేతనం కార్మికులకు ఇవ్వడము వలన యజమాన్యముకు కోట్లాది రూపాయలు ఆదా అవుతుందని కార్మికులకు మేలు జరుగుతుందని విశదీకరించి చెప్పిన ఫలితము లేదన్నానారు .తెలంగాణ ప్రభుత్వము థర్డ్ పార్టీ విధానము తొలగించి డైరెక్ట్ గా కార్మికులకు వేతనం ఇస్తున్నదని అదే ఏపీ లో అమలుచేయాలన్నారు .అక్కడ లేని ఇబ్బందులు ఇక్కడ ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. యువ గళం పాదయాత్ర ఇచ్చిన హామీ ని నారా లోకేష్ నిలబెట్టుకోవాలని విద్యుత్ కార్మికుల న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే విద్యుత్ ఉద్యోగులకు 3 డి .ఏ లు పెండింగ్ లో ఉన్నాయని వెంటనే వాటిని ప్రకటించాలని కోరారు .విద్యుత్ ఉద్యోగులు 24/7 విధులు నిర్వహిస్తారని విద్యుత్ ఉద్యోగులను ఇతర ఉద్యోగులను ఒకటిగా చూడడం సరికాదన్నారు .ఈ ఏడాది ఎపి జెన్ కో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించిందని,అలాగే ప్రజలకు ఎటువంటి ఆటంకములేకుండా విద్యుత్ సరఫరా సాగడానికి ఉద్యోగులు కార్మికులు రాత్రియంబవళు ్ళ కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వము కూడా ఉద్యోగుల కార్మికుల కృషితోనే విద్యుత్ నష్టాలు తగ్గాయని మెరుగైన విద్యుత్ సేవలు ప్రజలకు అందించడంలో సిబ్బంది ని అభినందిసత్తామని అంటూ వారి సమస్యములు పరిస్కహరించపోవడం అన్యాయమన్నారు .అభినందనలు పొగడ్తలతోనే కార్మికుల కష్టాలు తీరవని వారి డిమాండ్స్ పరిస్కహరించినప్పుడే మరింత కష్టపడతారని గ్రహించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమములో ఎన్ .కొండా రెడ్డి,వెంకట స్వామి,సి .ఓ హరిఓబుల రెడ్డి వి గంగయ్య ,యం నరసింహులు,పి గిరిబాబు,జి చంద్ర శేఖర్,డి పుల్లారెడ్డి,వెంకట రమణ,విశ్వనాధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



## టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన - జిల్లా టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి

– 35 మంది లబ్ధిదారులకు రూ.17.59 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జమ్మలమడుగు(మనస్సాక్షి) జూన్ 22 : జమ్మలమడుగు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విన్న ఆయన,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను నియోజకవర్గ పరిధిలోని అర్హులైన 35 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.17,59,830 విలువైన చెక్కులను అందజేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం సకాలంలో అందేలా టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిర్రు సంతోష్ కుమార్,పార్టీ కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు విద్యా భరోసా

– జీవో జారీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల జూన్ 22 (మనస్సాక్షి): జిల్లాలోని అక్రిడియేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డికి ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు నిత్యం కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన, మధ్యతరగతి జర్నలిస్టు కుటుంబాలకు ఈ ఫీజు రాయితీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన అక్రిడియేటెడ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ నిర్ణయం జర్నలిస్టు వర్గాల్లో హర్షాతిరేకాలకు దారితీసింది.

## పద్మశ్రీ గ్రహీతలను సత్కరించిన మంత్రి లోకేశ్





న్యూఢిల్లీ (మనస్సాక్షి) జూన్ 22 : పద్మశ్రీ అవార్డులు స్వీకరించేందుకు ఢిల్లీ వచ్చిన సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. సోమవారం ఇద్దరు సీనియర్ నటులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సినిమా రంగానికి వన్నె తెచ్చిన ఇద్దరు నటులకు ఒకేసారి పద్మశ్రీ రావడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. వీరి సేవలను అభినందించారు. తెలుగువారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారని ప్రశంసించారు. ఇద్దరు నటులకు శాలువా కప్పి,జ్ఞాపిక అందజేశారు. కళారంగంలో వీరి కృషి యువతకు స్ఫూర్తి అని లోకేశ్ పేర్కొన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

–బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్




కడప,జూన్ 22 (మనస్సాక్షి):– నగరంలోని ఉటుకూరు కేవీకే కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో గోపూజ నిర్వహించి, అనంతరం ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సందర్శించారు. సమావేశానికి ముందు భూమి పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు వెన్నుముక వంటిదని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం లేకుండా భవిష్యత్తులో మానవ మనుగడ కష్టసాధ్యమవుతుందని అన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించి భూమిని, ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం లభించడంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు, వివిధ నమూనాలు గురించి వివరించారు. రైతులు భూమిని ఖాళీగా ఉంచకుండా సంవత్సరమంతా పచ్చదనంతో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అందుకోసం ప్రీ–మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని అనుసరించాలని తెలిపారు. అలాగే పొలాల్లో ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని రైతులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన అధికారి ప్రభాకర్ రెడ్డి, క్రిస్టినా ప్రియా, డా. మనసా, డా. శిల్పకళ, సాయి మహేశ్వరి, సురేష్ కుమార్, బీజేపీ నాయకులు వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# 'రాయలసీమ' పేరు పెట్టింది 'చిలుకూరి' వారే

–ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి



కడప, జూన్ 22 (మనస్సాక్షి): కళా ప్రపూర్ణ, మహోపాధ్యాయ, ఆంధ్ర బెర్నార్డ్ షా గా ప్రసిద్ధులైన చిలుకూరి నారాయణరావు గతంలో దత్త మండలం అని పిలుస్తున్న మన ప్రాంతాన్ని రాయలసీమగా నామకరణం చేసిన మహనీయుడని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ లో చిలుకూరి నారాయణరావు 75 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ భాషావేత్త, చరిత్రకారులు,సంస్కృతాంధ్ర పండితులైన నారాయణ రావు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి 1930 ఫిబ్రవరి 6వ తేదీన 11వ శతాబ్దంలో తెలుగు భాష పై పరిశోధన చేసి తొలిసారిగా తెలుగు సాహిత్యంలో పీహెచ్డీ అందుకున్నారని, ఆయన 240 గ్రంథాలు రాసిన బహు గ్రంథకర్తని,లక్ష 50 వేలు తెలుగు సామెతలు సేకరించిన దీక్షా తత్పరుడని కొనియాడారు. ప్రముఖ రచయిత డాక్టర్ పాలెం వేణుగోపాల్ ప్రసంగిస్తూ దత్త మండలానికి రాయలసీమ అన్న పేరును సూచించిన చిలుకూరి నవ్య సాహిత్య పరిషత్తు తొలి అధ్యక్షులని, శ్రీకృష్ణదేవరాయ విద్యా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షులని, ఖురాన్ ను తొలిసారిగా తెలుగులో అనువాదం చేసిన కీర్తి ఆయనకే దక్కుతుందన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ నారాయణ రావు అంబ, అచ్చి, పెల్లి,నందుడు,శూరసేనుడు, నిగమ శర్మ, బ్రహ్మశిరం మొదలైన నాటకాలు,సంస్కృతానువాదాలు, పదకోశాలు, భాషా, చారిత్రక పరిశోధనా గ్రంథాలెన్నో రాశారన్నారు. ప్రసిద్ధ రంగస్థల కళాకారులు దాసరి సుధాకర్ ప్రసంగిస్తూ ఎన్నోసార్లు అఖిల భారత రచయితల మహాసభల్లో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన భాషా ప్రేమికుడని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణకు నడుం కట్టిన కర్మ వీరులలో చిలుకూరి వారొకరని గుర్తు చేశారు. కార్యక్రమంలో రచయిత జ్యోతి జార్జి, తపలిస్ట్ గంగయ్య, బాల ఓబయ్య, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు

# రాజంపేట అభివృద్ధే డబుల్ ఇంజన్ సర్కార్ లక్ష్యం

–టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు



రాజంపేట, జూన్ 22 (మనస్సాక్షి):– మూడు పార్టీల సమన్వయంతో ప్రతినెలా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు.సోమవారం స్థానిక ఏ.బి చంద్రారెడ్డి గార్డెన్స్ నందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సమావేశానికి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోత రమేష్ నాయుడు,జనసేన సమన్వయకర్త అధికారి కృష్ణ గార్లతో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వైకాపా గొడ్డలి పార్టీకి చెందిన నాయకులు కులాల మధ్య చిచ్చుపెట్టి రాష్ట్రాన్ని ముక్కలుగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అటువంటి వారిని వదిలిపెట్టబోమని చమర్తి హెచ్చరించారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టును త్వరలోనే పునర్నిర్మాణం చేసి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని జగన్ మోహన్ రాజు తెలియజేశారు.అదేవిధంగా వారు మాట్లాడుతూ కూటమిలోని నాయకులు, కార్యకర్తలపై వైకాపా నాయకులు ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అదఃపాతాళానికి తొక్కేస్తామని జగన్ మోహన్ రాజు హెచ్చరించారు.అదేవిధంగా జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో ఒక్క నిమిషం ఆలోచన చేయకుండా మా నాయకుడు పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వానికి నాంది పలికారు అని తెలియజేశారు. నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ముందు ఉంటామని తెలియజేశారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోత రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయానికి కూటమిలోని నాయకులు కార్యకర్తలు అందరూ నడుం బిగించాలని నాగోతు పిలుపునిచ్చారు. అంతకుముందు చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాదాపు 800 కోట్లకు పైగా నియోజకవర్గ వ్యాప్తంగా సంక్షేమం,అభివృద్ధికి వివిధ పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాజంపేట తాసిల్దార్ దస్తగిరయ్య,ఎంపీడీవో వరప్రసాద్,క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, పట్టణ అధ్యక్షులు డి ఆర్ ఎల్ మనీ, అధ్యక్షులు మేడికొండ రవి నాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కర్ణాటకం చెంగల్రాయుడు, సింగల్ విండో చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు,యూనిట్ ఇన్చార్జిలు, మాజీ రాష్ట్ర డైరెక్టర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284